### ఛత్తీస్‌గఢ్‌లో 22 మంది మావోయిస్టులు లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్ : రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో దాదాపు 22 మంది మావోయిస్టులు ఇవాళ భద్రతా దళాల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో తొమ్మిది మంది మహిళలు కూడా ఉన్నారు. 22 మంది మావోయిస్టుల్లో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.50,000 సాయం అందించినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ పునరావాస పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. గతేడాది సుక్మాతో సహా బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 7న కూడా 26 మంది నక్సలైట్‌లు సరెండరైన విషయం తెలిసిందే. అంతకు కొన్ని రోజుల ముందు 70 మంది మావోలు మూకుమ్మడిగా లొంగిపోయారు.

వచ్చే మార్చి నాటికి నక్సల్స్ అంతం

మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో గురువారం జరిగిన సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌కు చెందిన 86వ రైజింగ్ డే ఫంక్షన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా షా మాట్లాడుతూ.. నక్సలైట్లు కేవలం నాలుగు జిల్లాలకే పరిమితమై ఉన్నట్లు చెప్పారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :49 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 19-04-2025 పేజీలు:4 వెల: 2.00


## విద్యార్థుల వీసాల రద్దులో 50శాతం భారతీయులే



న్యూఢిల్లీ,ఏప్రిల్18:అమెరికాలోని విదేశీ విద్యార్థుల వీసాలను ట్రంప్ యంత్రాంగం పెద్ద మొత్తంలో రద్దు చేస్తున్న క్రమంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ అమెరికా దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 327 వీసా రద్దు కేసులు తమకు అందినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారని.. అయితే వారి వీసా రద్దుకు సరైన కారణాలు పేర్కొనలేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదిక ప్రకారం.. వీసాలు రద్దు చేసిన విద్యార్థుల్లో 50శాతం మంది భారత్‌కు చెందినవారు కాగా 14శాతం మంది చైనా దేశీయులు. తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు. దీనిపై ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్, ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. ఈవిషయంపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎటు-వంటి స్పందన లేదు. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. తాజాగా ట్రంప్ యంత్రాంగం పలు యూనివర్సిటీలలోని విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని వారి వీసాలు కూడా రద్దయినట్లు- కళాశాలలు పేర్కొంటున్నాయి. వీసాల రద్దుకు అధికారులు సరైన కారణాలు కూడా తెలియజేయట్లేదని విద్యార్థులు వాపోయారు.

## త్వరలోనే బీజేపీ కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటన..




న్యూఢిల్లీ,బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వారసుడిగా ఎవరొస్తారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. త్వరలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ప్రకటించనుంది. ఏప్రిల్ 22, 23 తేదీల్లో ప్రధాని మోడీ సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. అనంతరం కేబినెట్ విస్తరణ కూడా ఉండే ఛాన్సుందని తెలుస్తోంది.ప్రస్తుతం బీజేపీ అధ్యక్ష రేసులో కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఎక్కువగా మనోహర్ లాల్ ఖట్టర్‌కు అవకాశం ఉన్నట్లు వార్తలు తెలుస్తోంది. ప్రధాని మోడీతో ఖట్టర్‌కు మంచి సంబంధాలు ఉన్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలో ఆయనకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపిస్తున్నాయి.అనంతరం మోడీ కేబినెట్ విస్తరణ చేసే అవకాశం కూడా ఉంది. త్వరలోనే బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్డీఏ మిత్రపక్షాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వొచ్చని సమాచారం. ఎన్‌సీపీ, శివసేనతో పాటు బీహార్‌లోని ఇతర మిత్రపక్షాలకు చోటు లభించే ఛాన్సుంది. కొత్త ముఖాలకు అవకాశం ఉంది. ఇక బీహార్ నుంచి ఉపేంద్ర కుష్వాహా వంటి నేతకు కేబినెట్‌లో చోటు లభించే ఛాన్సుంది. వక్ఫ్ చట్టంపై ముస్లింలలో ఉన్న వ్యతిరేకత నేపథ్యంలో చాలా వ్యూహాత్మకంగా బీజేపీ హైకమాండ్ అడుగులు వేస్తున్నట్లుగా తెలుస్తోంది.

## ములుగు జిల్లాలో భూభారతి పైలెట్ ప్రాజెక్టుని ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు




ములుగు : ములుగు జిల్లా వెంకటాపురంలో భూభారతి పైలెట్ ప్రాజెక్టుని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..భూభారతి చట్టం అమలులో పైలెట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లాలోని వెంకటాపురం ఎంపిక చేయడం రెవెన్యూ మంత్రి శ్రీనాన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భూమి అనేది ఒక ఆత్మబలం, ఒక ఆదాయం.. గత ప్రభుత్వం ధరణి పేరుతో దగా చేసిందని అన్నారు. గతంలో నిజమైన రైతులకు గత ప్రభుత్వంలో పట్టాలు కాకుండా నష్టం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో అధికారులను వాడుకొని బీఆర్ఎస్ నాయకులు వాళ్ల పేరు మీద భూములను ఎక్కించుకున్నా సందర్భాలు ఉన్నాయి. పేదవారిని ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడితే గత పాలకులు కళ్ళలో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. ప్రజలకు ఏమి దక్కులో అది దక్కేలా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని మంత్రి అన్నారు. మహిళలకు ఇవ్వాల్సిన 3,000 కోట్ల వడ్డీని ఎగకొట్టి పోయారని.. అవన్నీ మేము ఇస్తున్నామన్నారు. ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారు? ఎవరు దోచుకున్నారో ఆలోచించండి అంటూ మంత్రి మాట్లాడారు.ఇదే కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రైతు కోసం ఆలోచించిన అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఇప్పటికీ రైతు మనసులో నిలిచిపోయారని ఆవిడ అన్నారు. ధరణి పేరుతో పోర్టల్ పెట్టి రైతుల నోట్లో మట్టి కొట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇందిరమ్మ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని తీసుకొస్తే.. అలా మిగిలిన భూములన్నిటిని ధరణి పేరుతో నేతలు వాళ్ల పేరు మీద ఎక్కించుకున్నారు.. కేసీఆర్ రైతుల గురించి తప్ప మిగిలిన అన్ని ఆలోచించేవారని వ్యాఖ్యానించారు. రైతులకు సంబంధించిన ఎకరాలకు ఎకరాల భూములు లాక్కున్న ఘనత గత ప్రభుత్వానికి దక్కిందని ఆమె వ్యాఖ్యానించారు. గతంలో రైతులు కోల్పోయిన భూములను వారికి అందించేందుకే ఈ భూభారతి చట్టం అందుబాటులోకి వచ్చిందని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి లో ఎవరికి న్యాయం జరగలేదని అన్నారు. భూభారతి చట్టం అమలులో పుట్టుకొచ్చే దళారుల పైనా అప్రమత్తంగా ఉండాలని ఆమె హెచ్చరించారు. ఏ కొత్త చట్టం తీసుకొచ్చిన కొందరు దళారులు తయారవుతారు.. దళారులను నమ్మకండి నేరుగా ప్రభుత్వ అధికారులకే మీ సమస్యలు తెలపండి.. భూభారతి చట్టం ద్వారా మీ సమస్యలు పరిష్కారం అవడానికి అవకాశం ఉంది.. భూభారతి చట్టంలో డబ్బులకు ఆస్కారం లేకుండా, లంచాలకు చోటు ఇవ్వకండని ఆమె అన్నారు.అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పినందుకే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. అసెంబ్లీలో భూభారతి చట్టం పెట్టినప్పుడు టీఆర్ఎస్ నేతలు తీరును రాష్ట్ర ప్రజలందరూ పరిశీలించారన్నారు. మీరు చట్టం చేసినప్పుడు ఇలాంటి రెవెన్యూ సదస్సును పెట్టరా..? 2020లో కనీసం రెవెన్యూ సదస్సులో కూడా పెట్టలేని చట్టాన్ని మీరు తెచ్చారని.. ఈ భూభారతి చట్టంలో గతంలో ఉన్న తొమ్మిది లక్షల 50 వేల అప్లికేషన్ల సమస్యలను పరిష్కరించే విధంగా ఈ భూభారతి చట్టం వ్యవహరిస్తుందని తెలిపారు. గతంలో సాగులో రైతులు ఉంటారు కానీ.. పట్టా పాస్ పుస్తకంలో మాత్రం పింక్ షర్టు వేసున్న వాళ్ళ పేర్లు పాస్ పుస్తకంలో ఉంటుంది. ఇలా రైతుబంధులు కొట్టేసేందుకు ధరణి చట్టాన్ని అప్పుడు తీసుకొచ్చారని అన్నారు. మీ భూముల సమస్యలను మహిళలు మంగళ సూత్రాలు అమ్ముకొని హైకోర్టు వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ భారతి చట్టం చేస్తుందని అన్నారు. రెవెన్యూ అధికారులే మీ గ్రామానికి వస్తారు.. సమస్య అక్కడే పరిష్కరిస్తారు. గతంలో దొర పెట్టిన పార్ట్ B లో 18 లక్షల ఎకరాల భూములు పేదలవే ఉన్నాయని.. ఎవరో ఒకరు తప్పు చేశారని వీఆర్వో వ్యవస్థను తీసేసిన పెద్దమనిషి కేసీఆర్ అంటూ ఎద్దేవా చేసారు.రెవెన్యూ గ్రామాల్లో వస్తున్న సమస్యలను పరిష్కరించేలాగా రెవెన్యూ అధికారుల నియామకాలు చేపడుతున్నామని.. ఏ చట్టం చేసిన పేదలకు ఉపయోగపడేలాగా ఉండాలని ఆయన అన్నారు. ఒక చట్టం కనీసం 50 ఏళ్ళు 70 ఏళ్ళు ఉండేలాగా ఉంటుంది. 2020లో చేసిన చట్టం 3 ఏళ్లలోనే ఆ చట్టం ముగిసిపోయిందంటే ఆ చట్టం లో ఎంత లోపాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని, పేదోడి ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదోడి కళ్ళలో నీళ్లు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారుల మీదనే ఉందని అన్నారు. గత ప్రభుత్వం ధరణి చట్టాన్ని నాలుగోడల మధ్యలో రూపొందించారు. వారి అవసరం కోసం ఈ చట్టాన్ని తెచ్చుకున్నారు. కానీ, భూభారతి చట్టం ప్రజల మధ్య రూపొందింది ప్రజల కోసం తయారైన చట్టాలని.. మా స్వార్థం కోసం నాయకుల కోసం తయారైన చట్టం భూభారతి కానే కాదని అన్నారు. ఎమ్మార్వో తప్పు చేస్తే ఆర్డీఓ కి, ఆర్డీఓ తప్పు చేస్తే అడిషనల్ కలెక్టర్ కి, అడిషనల్ కలెక్టర్ తప్పు చేస్తే కలెక్టర్ కి చెప్పవచ్చు. ఒకవేళ కలెక్టర్ కూడా తప్పు చేస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ట్రిబునల్ కూడా అందుబాటులోకి తేబోతున్నమని అన్నారు. సరిహద్దులతో భూములను రికార్డు చేసేలా ఈ భూభారతి చట్టం రూపొందిందని, సర్వేయర్లు లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు 6000 మంది సర్వేయర్లకు లైసెన్స్ ఇచ్చామని తెలిపారు. ధరణి చట్టానికి నియమ నిబంధనలు లేవు కానీ.. భూభారతి చట్టానికి నియమ నిబంధనలు నియమించామన్నారు. భూభారతి చట్టంలో ఏమన్నా లోపాలు ఉంటే వాటిని సరి చేసుకోవడానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి భేషదాలు లేవని, దొరవారి లాగా చేసిన తప్పులు కప్పిపుచ్చుకున్న ప్రయత్నం ఈ ప్రభుత్వం చేయదని అన్నారు.

## వైద్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన సీఎం..



హైదరాబాద్, పండగరోజు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాలు కాపాడిన సంఘటనగా ఓ ఉదంతం రాష్ట్రంలో వెలుగులోకి వచ్చింది. విశాఖపట్నం వాసి హేమంత్ (22) అనే యువకుడు గత నెల 29న షిరిడి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండటంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమంగా ఉందని చెప్పి ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు హేమంత్‌ను అడ్మిట్ చేసుకోలేదు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు హేమంత్‌ను ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సెలవు రోజు అయినప్పటికీ జనరల్ సర్జరీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రంగా అజ్మీరా, డాక్టర్ విక్రమ్ నేతృత్వంలోని వైద్య బృందం వెంటనే పరీక్షలు నిర్వహించి పేగులో రంధ్రం ఏర్పడినట్లు గుర్తించారు. అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి వ్యర్థ పదార్థాలను తొలగించి, పేగులో రంధ్రాన్ని ట్రీట్ చేశారు. పది రోజులు చికిత్స అనంతరం హేమంత్‌ను డిశ్చార్జ్ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షల ఖర్చుతో జరిగే చికిత్సను ఉచితంగా చేసి, ప్రాణాలను కాపాడిన ఉస్మానియా వైద్యులపై ప్రస్తుతం ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ రంగా అజ్మీరా సూచించారు.ఈ విషయమై జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన.. నేను రానుబిడ్డో సర్కారు దవాఖానాకు అన్న నానుడిని తిరగ రాసి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తలచుకుంటే, అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరని రుజువు చేసి ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిన ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రంగా అజ్మీరా, డాక్టర్ విక్రమ్ బృందం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవ చేస్తున్న ప్రతి ఒక్క వైద్యుడు, సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని తెలుపుతూ.. వారికి నా ప్రత్యేక అభినందనలు అంటూ రాసుకొచ్చారు.

## ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం..!



న్యూఢిల్లీ, న్యాయవ్యవస్థపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. జడ్జీలకు బాధ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. సుప్రీంకోర్టు తాజా తీర్పు రాష్ట్రపతిని ఆదేశిస్తోంది..ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు అని కామెంట్ చేశారు.. అయితే, ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం అన్నారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కె.రామకృష్ణ.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. భారతదేశంలో అధికారంలో ఉన్న పెద్దలు న్యాయవ్యవస్థ పై దాడి చేస్తున్నారు.. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యలు సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం.. రాష్ట్రాల గవర్నర్ల పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆయనకు నచ్చడం లేదు.. దేశంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు..వక్ఫ్ లో ఇతర మతస్తులను పెట్టొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగం పై దాడిగా పేర్కొన్నారు రామకృష్ణ.. వక్ఫ్ బిల్లు పై సొలిసిటర్ జనరల్ కూడా సుప్రీంకోర్టును అవమానించే పద్ధతిలో మాట్లాడుతున్నారు.. ప్రమాదకరమైన వక్ఫ్ బిల్లు పాస్ కావడానికి టీడీపీ కారణమవ్వడం దురదృష్టకరం అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చి చంద్రబాబు, నితీష్ కుమార్.. దేశవ్యాప్తంగా చిచ్చు పెట్టారు.. చంద్రబాబు ఇచ్చిన సవరణలను ఆమోదించకపోయినా.. ఎందుకు బిల్లుకు మద్దతు తెలిపారు? అని నిలదీశారు.. చంద్రబాబు తన స్వార్థ రాజకీయాలు పక్కన పెట్టాలని సూచించారు. ఏపీలో కామెడీ రాజకీయం నడుస్తోంది.. రకరకాల కారణాలతో గోశాల ఆవులు చనిపోయుండొచ్చు.. దానికి అంత చర్చ దేనికి..? ఆవుల మృతి పై కరుణాకర్ రెడ్డి చేసిన సూచనలు తీసుకుంటే తప్పేముంది? కూటమి పార్టీలన్నీ కలిసి పక్కా కామెడీ ట్రాక్ నడిపిస్తున్నారు అంటూ ఎద్దేవా చేశారు..రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు రామకృష్ణ.. రాజధాని అప్పులకు కేంద్రమే ష్యూరిటీ ఇస్తుందని.. చివరకు హడ్కో, వరల్డ్ బ్యాంక్, ఏషియన్ బ్యాంకు నుంచి అప్పులు తెచ్చారన్న ఆయన.. KFW ఒకటి ఉందని చంద్రబాబుకే తెలుసు.. జర్మనీ సంస్థ KFW నుంచి ఐదువేల కోట్లు అప్పుతెచ్చారు.. అమరావతి కోసం 62 వేల కోట్లు అప్పులు తెచ్చారు .. ఈ అప్పుల్లో కేంద్రం ఏమైనా గ్రాంట్ ఇచ్చిందా..? ఈ అప్పును కేంద్రం చెల్లిస్తుందా..? అని ప్రశ్నించారు. సెల్ఫ్ సస్టైనబుల్ ప్రాజెక్ట్ అని చెప్పి మరో 44 వేల ఎకరాలు తీసుకోవాలని చూడటమేంటి..? అని నిలదీశారు.. సీఎం సొంతజిల్లా చిత్తూరులో అన్నీ మూతపడ్డాయి.. కడప స్టీల్ ఫ్యాక్టరీ గురించి చంద్రబాబు మాట్లాడటం లేదు.. 26 జిల్లాల్లో అత్యధికంగా వలసలున్న జిల్లా కర్నూలు.. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు ఎవరడిగారు నిన్ను.. మే2వ తేదీ మళ్లీ ప్రధాని రావడం దేనికి? అంటూ సీఎం చంద్రబాబుపై ప్రశ్నల వర్షం కురిపించారు సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ..

## ఒక్క కేసు కాదు.. మరో 100 కేసులు పెట్టిన భయపడేది లేదు..




తిరుపతి:ఒక్క కేసు కాదు.. ఇలాంటివి మరో 100 కేసులు పెట్టిన నేను భయపడే వ్యక్తిని కాను అని స్పష్టం చేశారు టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి..తనపై కేసులు పెట్టడంపై స్పందించిన ఆయన.. నాపై వ్యక్తిగత దాడులు, వ్యక్తిత్వ హననం చేస్తే భయపడతాం అనుకుంటే మీ భ్రమ.. మీ తప్పుల్ని ఎత్తి చూపుతూనే ఉంటా, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నిస్తూనే ఉంటా.. తప్పుడు కేసులు పెట్టడం వల్ల భయపడిపోతాం అనేది మీ భ్రమ మాత్రమే అంటూ కౌంటర్ ఎటాక్ చేశారు.. కేసుల వల్ల నేను ధర్మం వైపు నిలబడకుండా పోవడం అన్నది ఎట్టి పరిస్థితుల్లో జరగు అన్నారు భూమన.. న్యాయం మా వైపు ఉంది, నాపై ఒక్క కేసు కాదు, ఇలాంటివి మరో 100 కేసులు పెట్టిన నేను భయపడే వ్యక్తిని కాను అన్నారు.ఇక, విద్యార్థి దశ నుంచి పోరాటాలు నుంచి వచ్చిన వాడిని.. ఏ తప్పు జరిగినా నేను నిలదీస్తూనే ఉంటాను అన్నారు భూమన.. మీ పాలనలో జరిగే అరాచకాలు ప్రశ్నించక పోతే పాపం అవుతుంది.. దేవుడ్ని అడ్డుపెట్టుకుని తప్పుడు వాగ్దానాలు చేసి మీరు అధికారంలోకి వచ్చారు.. మీ పాలనలో 10 నెలలు కాలంలో టీటీడీ అప్రదిష్ట పాలు అయ్యింది.. రాష్ట్ర ప్రజలు, హిందువులు అందరూ గమనిస్తున్నా రని అని వ్యాఖ్యానించారు టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి.. కాగా, గోశాలలో ఆవుల మృతిపై అసత్య ఆరోపణలు చేశారని, భక్తుల మనోభావాలను దెబ్బ తీశారని ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌లో భూమనప కేసు నమోదు చేశారు.. భూమనపై ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. భాను ప్రకాష్ రెడ్డి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్‌ల కింద భూమనపై ఎస్వీయూ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఎస్వీ గోశాలలో 100 గోవులు మరణించాయని, పవిత్రమైన

## ఎలాన్ మస్క్‌కి ప్రధాని మోడీ ఫోన్..



న్యూఢిల్లీ,టారిఫ్‌ల విషయంలో భారత్, అమెరికాల మధ్య వాణిజ్య చర్చల అంశం కొనసాగుతున్న సమయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కార్ లోని డోజ్ విభాగ అధిపతి, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌తో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోన్‌లో చర్చలు జరిపారు. ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా ప్రధాని తెలియజేశారు.అయితే, ఎలాన్ మస్క్‌తో పలు కీలక అంశాలపై చర్చించాను.. ఈ ఏడాది ప్రారంభంలో వాషింగ్టన్‌లో మా సమావేశం సందర్భంగా చర్చకు వచ్చిన అంశాలనూ మేం ప్రస్తావించామని ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఇక, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న ప్రాముఖ్యతపై ఇరువురం చర్చించాం అన్నారు. ఈ రంగాల్లో అమెరికాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడించారు. ఇక, భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌లోకి టెస్లా ప్రవేశించడానికి గల అవకాశాలపై ఎలాన్ మస్క్- ప్రధాని మోడీల మధ్య సంభాషణ జరిగినట్లు తెలుస్తుంది.

సంపాదకీయం

శనివారం 19-04-2025

# అధిక సుంకాలు... అందివస్తున్న అవకాశాలు!

'అమెరికా ఫస్ట్' పేరిట ట్రంప్ యంత్రాంగం అనుసరిస్తున్న వ్యూహం అంతర్జాతీయ వాణిజ్యంలో మౌలిక మార్పులకు నాంది పలికింది. అనేక దేశాలపై ట్రంప్ 'ప్రతీకార' సుంకాలు విధించారు. వాటి అమలుకు 90 రోజుల గడువిచ్చి, ఆయా దేశాలను సంప్రదింపులకు రమ్మనడం సరికొత్త పద్ధతి.%'అమెరికా ఫస్ట్' పేరిట ట్రంప్ యంత్రాంగం అనుసరిస్తున్న వ్యూహం అంతర్జాతీయ వాణిజ్యంలో మౌలిక మార్పులకు నాంది పలికింది. అనేక దేశాలపై ట్రంప్ 'ప్రతీకార' సుంకాలు విధించారు. వాటి అమలుకు 90 రోజుల గడువిచ్చి, ఆయా దేశాలను సంప్రదింపులకు రమ్మనడం సరికొత్త పద్ధతి. అమెరికా వాణిజ్య విధానం భారత్‌కు సవాళ్లతోపాటు అవకాశాలనూ అందిస్తోంది. ఇండియా, అమెరికాల వాణిజ్య భాగస్వామ్యం విస్తృతమైంది. రెండు దేశాల మధ్య 2023-24లో సుమారు 119.7 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఈ కాలంలో అమెరికాకు ఇండియా 77.5 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసింది. ప్రపంచ దేశాలన్నింటికీ భారత్ చేస్తున్న ఎగుమతుల్లో ఇది 17.7శాతం. అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన దిగుమతుల విలువ 42.1 బిలియన్ డాలర్లు. ఇది భారత్‌కు వచ్చిన మొత్తం దిగుమతుల్లో 6.2శాతం. భారత్‌కు అమెరికా నుంచి వస్తున్న దిగుమతుల కంటే మనదేశం అగ్రరాజ్యానికి చేస్తున్న ఎగుమతులే అధికం. దీనివల్ల అమెరికాతో ఇండియా వాణిజ్య మిగులు సాధిస్తోంది. అమెరికా దిగుమతుల్లో 17శాతం చైనా నుంచి, 13శాతం కెనడా నుంచి, 14శాతం మెక్సికో నుంచి మూడు శాతం భారత్ నుంచి వస్తున్నాయి. అమెరికాకు బాగా ఎగుమతి అవుతున్న ఆరు ఉత్పత్తుల్లో చైనాదే పైచేయి. భారత్ ఎగుమతుల వాటా తక్కువే. ఇండియా ప్రధానంగా ఇంజినీరింగ్ వస్తువులు, బంగారు ఆభరణాలు, రత్నాలు, ఔషధాలు, పెట్రోలియం ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ట్రంప్ విధించిన సుంకాలు రెండంకెల స్థాయిలో ఉన్న రత్నాలు, ఆభరణాలు, ఖనిజాలు, ఇంధనాలు, ఔషధాలు, ఇనుము, ఉక్కు, అణు రియాక్టర్లు, సేంద్రియ రసాయనాల ఎగుమతులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే నాలుగంకెల స్థాయిలో ఉన్న వజ్రాలు, ఔషధాలు, పెట్రోలియం ఇంధనాలు, ఆభరణాలు, వాహన విడిభాగాలు, సముద్ర ఆహారం, మొబైల్ ఫోన్లు, వ్యవసాయ రసాయనాలు, జౌళి, ఏరోస్పేస్ పరికరాల ఎగుమతులు కూడా ఒక మోస్తరుగా సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.

వాణిజ్యానికి అంతరాయం

అమెరికా తీరు భారత్‌తో చేసే వాణిజ్యంలో కొంతమేర అంతరాయం కలిగించే అవకాశముంది. అయితే, భారత్ ఎగుమతి చేస్తున్న ఔషధాలు, ఇంజినీరింగ్ వస్తువులకు డిమాండ్ కొనసాగవచ్చు. ట్రంప్ చైనాపై అధిక సుంకాలు విధించిన నేపథ్యంలో ఇండియా కీలక రంగాలకు సంబంధించిన ఉత్పత్తుల ఎగుమతుల్ని విస్తరించుకునే అవకాశం ఏర్పడుతోంది. చైనాపై అమెరికా విధించిన సుంకాల్లో 40శాతం కార్మికుల అవసరం అధికంగా ఉండే- జౌళి, వస్త్ర పరిశ్రమ, పాదరక్షలు వంటి ఉత్పత్తులపైనే. ఇది భారత ఉత్పత్తులకు డిమాండ్ పెంచుతుందని భావిస్తున్నారు. రత్నాలు, ఇనుము, ఉక్కు, ఆభరణాలు, సేంద్రియ రసాయనాలు వంటి రంగాల్లోనూ ఎగుమతులు పెంచుకునే వీలుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే ఇండియా తనఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ముడిపదార్థాలు, ఉత్పాదనల సరఫరా గొలుసు వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దుకోవాలి. వాణిజ్య సంప్రదింపుల్లో చొరవ చూపి అమెరికా మార్కెట్‌లో మరింత విస్తృత స్థానం సంపాదించాలి. బహుముఖ వ్యూహంతో పరిస్థితుల్ని అనుకూలంగా మలచుకోవాలి. భారత్ తన సుంకాల వ్యవస్థను సరళీకరించాలి. ముడిసరకులపై అయిదు శాతం, ఉత్పత్తులపై 10శాతం సుంకం విధించే విధానాన్ని అమలు చేయడం శ్రేయస్కరం. ఇది ఉత్పాదక, వాణిజ్య రంగాల్లో సామర్థ్యం మెరుగుదలకు దోహదపడుతుంది. దేశీయంగా ఉత్పత్తి చేసుకునే అవకాశం తక్కువగా ఉన్న వస్తువులపై దిగుమతి సుంకాన్ని తగ్గించుకుంటే మేలు. చైనా సరఫరాల విషయంలో అనిశ్చితి కారణంగా ఉత్పాదక రంగంలో భారత్ స్థిరమైన ప్రత్యామ్నాయంగా ఎదిగింది. ఇలాంటి పరిస్థితి నుంచి ప్రయోజనం పొందాలి. భారత్ ప్రపంచ స్థాయి సామర్థ్య నిర్మాణ కేంద్రాలకు నెలవు. అనేక సాంకేతిక సంస్థలు ఇక్కడ పరిఢవిల్లుతున్నాయి. ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కార్మికుల్లో 50 నుంచి 70శాతం మంది భారత్‌లో ఉపాధి పొందుతున్నారు. ఒక్క ఐటీ రంగానికే పరిమితం కాకుండా విద్య, వైద్య సేవల్లో నెలకొన్న కొరతను అధిగమించడానికి కూడా సంసిద్ధమవ్వాలి. చవకైన ఉత్పత్తుల కోసం చైనాపై ఆధారపడే పరిస్థితి అంతరిస్తున్న ప్రస్తుత దశలో భారత్ తన పారిశ్రామిక సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ప్రపంచ సరఫరా రంగంలో పైస్థాయికి ఎదగాలి.

మార్కెట్ అనిశ్చితి

అమెరికా- చైనా పరస్పరం పోటాపోటీగా విధించుకుంటున్న సుంకాలు వినిమయ వస్తువుల మార్కెట్‌ను అనిశ్చితికి గురిచేస్తున్నాయి. అమెరికా తన ఉత్పత్తులను చైనాకు ఎగుమతి చేసే పరిస్థితి లేకపోతే, వాటిని భారత్‌కు మళ్లించే అవకాశం ఉంది. ఇతర దేశాల్లో మూసుకుపోయే మార్కెట్ కారణంగా అమెరికా మనదేశానికి వంట నూనె ఎగుమతి చేసేందుకు ప్రయత్నించవచ్చని వాణిజ్య వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల పెంపు కారణంగా చైనాలో పత్తికి డిమాండు పెరిగే అవకాశం ఉంది. భారత జౌళి ఉత్పాదనల పరిరక్షణ కోసం అమెరికాతో సంప్రదింపులు జరపాలని భారత జౌళి పరిశ్రమ సమాఖ్య కోరుతోంది. వ్యవసాయ రంగాన్ని సరళీకరించాలని అమెరికా చాలాకాలంగా మనదేశాన్ని కోరుతోంది. ఇప్పటిదాకా భారత్ ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్యంలో వ్యవసాయ ఉత్పత్తులను చేర్చలేదు. వీటికి అవకాశం కల్పిస్తే మనదేశంలోని చిన్న సన్నకారు రైతులు బహుళజాతి సంస్థలతో పోటీ పడలేక చతికిలపడిపోయే ప్రమాదం ఉంది. అందుకే అభివృద్ధి చెందిన దేశాల నుంచి వచ్చే వ్యవసాయోత్పత్తులపై ఇండియా అధిక సుంకాలు విధిస్తోంది. మరోవైపు, అమెరికా విధించిన సుంకాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మందగింపజేస్తున్నాయి. సరఫరా గొలుసులను తెంచి ధరల పెరుగుదలకు కారణమై ప్రపంచ ఆర్థికంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. సుంకాల పెంపుదలకు విధించిన గడువులోగా తన ఎగుమతులపై సంప్రదింపులు చేపట్టేందుకు భారత్‌కు వీలు కలిగింది. అయితే వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల విషయంలో మాత్రం భారత్ జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది.

# చైనా షాక్... అమెరికా షేక్



వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలతో బెదిరిస్తూ మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధానికి ప్రతిస్పందనగా చైనా కూడా దీటుగా చర్యలు చేపట్టింది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని చైనా నిలిపివేసింది. దీంతో పశ్చిమ దేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్ల కంపెనీలకు సమస్యలు ఎదురు కానున్నాయి. అంతేకాదు అగ్రరాజ్యానికి చైనా తాజాగా మరో షాక్ ఇచ్చింది. అమెరికా వైమానిక రంగ దిగ్గజమైన బోయింగ్ నుంచి ఎటువంటి డెలివరీలు అంటే వైమానిక రంగంలో వినియోగించే విడిభాగాలను అమెరికా నుంచి కొనుగోలు చేయవద్దని స్వదేశీ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ షాక్‌లు అమెరికాను షేక్ చేస్తున్నాయి. అయినా అమెరికా మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. తమ మార్కెట్ పైనే చైనా ఎక్కువగా ఆధారపడుతుంది కాబట్టి చైనాయే తమతో వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని సన్నా యి నొక్కులు నొక్కుతోంది. చైనా ప్రస్తుతం రూపొందిస్తున్న ఎగుమతుల నిబంధనలు అమలులోకి వచ్చే వరకు చైనా పోర్టుల నుంచి మాగ్నెట్‌ల ఎగుమతులు కావు. కార్లు, డ్రోన్లు నుంచి రోబోలు, క్షిపణులు వరకు అత్యంత అవసరమైన మేగ్నెట్లు ఎగుమతి కాకుంటే అమెరికాతోపాటు మరికొన్ని దేశాల్లో ఈ అరుదైన ఖనిజాలపై ఆధారపడే కంపెనీలు శాశ్వతంగా మూతపడక తప్పదు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90 శాతం చైనా నుంచే సరఫరా అవుతున్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్ మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు 90% ముడి పదార్థాలకోసం చైనా పైనే ఆధారపడుతున్నాయి. కీలక ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్‌లో చైనా తనకున్న సామర్థ్యాన్ని సాయుధంగా వినియోగిస్తోంది. అంతేకాదు ఈ అపురూప, కీలక ఖనిజాల ఎగుమతి లైసెన్సులను కూడా పరిమితం చేయవచ్చు. కీలకమైన లోహాలను సృష్టించే అవకాశం అమెరికాకు లేదు. కానీ అత్యంత అవసరమైన పరికరాలను సృష్టించవలసిన అగత్యం తప్పదు. పునరుత్పాదక సహజ ఇంధన ఉత్పత్తి, శక్తివంతమైన కంప్యూటర్ల తయారీపై ప్రపంచ దేశాలన్నీ ఆధారపడి ఉంటున్నందున అరుదైన లోహాల అవసరం గత కొన్నేళ్లుగా పెరుగుతోంది. ఉదాహరణకు స్మార్ట్ ఫోన్ల వైబ్రేషన్ యూనిట్లకు అరుదైన రసాయనిక మూలకాలు టెర్బియమ్, డిస్ప్రోజియం ఎంతో అవసరం. ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లకు శక్తి నియోడిమియమ్ అనే మూలకం వల్ల లభిస్తుంది. మందుగుండు సామగ్రికి, సెమీకండక్టర్ చిప్‌లకు, టంగ్‌స్టన్ అనే లోహంఉపయోగపడుతుంది. జెట్ ఇంజిన్లకు, డ్రిల్లింగ్ రిగ్‌లకు మిశ్రమ లోహాలు వినియోగిస్తారు. దాదాపు ఈ అపురూప ఖనిజాల తవ్వకాలను, ప్రాసెస్‌ను చైనాయే నిర్వహిస్తోంది. ఈ మేరకు కావలసిన మౌలిక సౌకర్యాలను కొన్ని దశాబ్దాలుగా చైనా సమకూరుస్తోంది. ఫలితంగా టెస్లా, యాపిల్ వంటి అనేక కంపెనీలు తమకు కావలసిన అరుదైన మూలకాల కోసం చైనా పైనే ఆధారపడుతున్నాయి. అందుకనే భౌగోళిక రాజకీయ బేరసారాలు సాధనంగా తమ ఆధిపత్యాన్ని సాగించడానికి చైనా వెనుకాడడం లేదు. 2010లో జపాన్‌తో ఉద్రిక్తతలు తలెత్తడంతో కీలకమైన ఖనిజ మూలకాల ఎగుమతులను చైనా నిలిపివేసింది. గత రెండేళ్లుగా గేలియమ్, గేర్మేనియమ్, గ్రాఫైట్ వంటి కీలకమైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించింది. ఈ పరిస్థితిని ఊహించే వైట్‌హౌస్ ఈ నెల తమ టారిఫ్‌ల పరిధి నుంచి కీలకమైన ఖనిజాలను మినహాయించడం గమనార్హం. కానీ అన్ని దేశాలకు ఏడు రకాల కీలక ఖనిజాల మూలకాల ఎగుమతులపై చైనా నియంత్రణను వైట్‌హౌస్ అడ్డుకోలేదు. వాణిజ్యంలో ఉద్రిక్తతలు పెరిగితే ఈ లోహాలను బేరసారాల సాధనంగా వినియోగించుకోవాలన్నది చైనా లక్ష్యం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉపయోగించే మైక్రోచిప్స్ కూడా చైనా టార్గెట్ చేసే జాబితాలో ఉన్నాయి. రానున్నకాలంలో అరుదైన లోహాల మూలకాల ఎగుమతులు చైనా నుంచి తగ్గిపోవచ్చు. ఎగుమతుల నియంత్రణ విధానాలకు అనుగుణంగా కంపెనీలు చైనాకు దరఖాస్తులు పెట్టుకోవలసి వస్తుంది. ఈ ప్రభావం లాక్‌హీడ్ మార్టిన్ వంటి అమెరికా రక్షణ సంస్థలపై పడవచ్చు. ఈ కంపెనీలు క్షిపణుల తయారీకి, జెట్ విమానాలకు కీలక ఖనిజ మూలకాలు అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో చైనా వంటి ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గించుకోవాలని అమెరికాకు వాణిజ్య నిపుణులు సూచిస్తున్నారు. మరికొందరు ఈ ఖనిజాల కొరత తీరాలంటే చంద్రునిపై ఖనిజాల తవ్వకం చేపట్టడమే సరైన పరిష్కారమని సూచిస్తున్నారు. కొన్ని వాణిజ్య సంస్థలు అమెరికాలో ఖనిజాల తవ్వకాన్ని, ప్రాసెసింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవడంలో నిమగ్నమయ్యాయి. ఇలాంటి మార్పులకు ట్రంప్ టారిఫ్‌లు రాయితీలు కల్పించే అవకాశం ఉంది. అలాగే సరఫరా చైన్లను విస్తరించుకోవాలని అమెరికా కంపెనీలపై ఒత్తిడి ప్రారంభమైంది. అయితే కీలకమైన ఖనిజాల సరఫరా విస్తరించడానికి పెట్టుబడుల సమస్యే ప్రధాన అడ్డంకి. ఇలాంటి ప్రయత్నాలను వేగవంతం చేయడానికి అమెరికాలో తగినంత మౌలిక సదుపాయాలు కానీ, సౌకర్యాలు కానీ లేవు. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికాలో మైనింగ్ ఇంజినీరింగ్ చేపట్టగల ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు క్రమంగా తగ్గిపోతుండటం గమనార్హం. ఈ పరిస్థితుల్లో కొత్తగా గనుల తవ్వకాన్ని వేగవంతం చేయాలని ఒత్తిడి తీసుకువచ్చినా ఇప్పట్లో అది సాధ్యం కాకపోవచ్చు. అమెరికా స్వయం సామర్థం సాధించి కీలకమైన ఖనిజాల తవ్వకాన్ని, ప్రాసెసింగ్ చేపట్టాలంటే మరికొన్ని సంవత్సరాలు పట్టవచ్చు.

# ప్రమాదంలో ముస్లింల అస్తిత్వం!

న్యూఢిల్లీ,భారతదేశం నుండి ముస్లిం దేశంగా పాకిస్తాన్ వేరు పడినప్పుడు, మాకు మరే దేశమూ వద్దు అన్నారు ముస్లిములు. మేం ఈ దేశస్తులమే, ఈ దేశంలోనే మా పూర్వీకుల అస్తిత్వాలు, త్యాగాలు, గుర్తులు ఉన్నాయని భారతదేశం లోనే ఉండిపోయిన భారత ముస్లిములకు నేడు అస్తిత్వాన్ని పరీక్షించుకోవలసి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఢిల్లీ జామా మస్జిద్ మెట్ల మీద నిలబడి ఓ ముస్లిములారా... ఈ దేశాన్ని విడిచి వెళ్ళకండి అని పిలుపు ఇచ్చిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి మహనీయుల అస్తిత్వాలు ఈ దేశంలోనే ఉన్నాయి.. అలాగే మనమంతా గర్వపడేలా జైహింద్ నినాదం సృష్టికర్త, సుభాష్ చంద్రబోస్‌కు నేతాజీ అని నామకరణం చేసిన బహుభాషా కోవిదుడు, ఆజాద్ హింద్ ఫౌజ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తూ బ్రిటీష్ బలగాలతో పోరాటం చేసిన యోధుడు హైదరాబాద్‌కు చెందిన తెలుగుబిడ్డ సయ్యద్ అబిద్ హసన్ సఫ్రాని వంటి వారి అస్తిత్వాలు ఈ దేశంలోనే ఉన్నాయి కదా.

సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్న వారిని..

మౌలానా అబ్దుల్ బారి, ముహమ్మద్ గులాం మొహి యుద్దీన్, ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ ఎలా ఎంతో మంది స్వతంత్ర సమర యోధుల అస్తిత్వాలు ఈ దేశంలోనే ఉన్నాయి కదా.. అంతే కాకుండా భారతదేశాన్ని శత్రువులతో కాపాడు కోవడానికి క్షిపణులు తయారు చేసిన శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అస్తిత్వాలు ఈ దేశంలోనే ఉన్నాయి కదా.. భారతీయ సంస్కృతిలో హిందూ ముస్లిం అంతర్భాగంగా ఉన్నారు. ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య స్నేహం, సోదరభావం ఆదర్శప్రాయంగా ఉంది. దీనికి గంగా జమున తహసీబ్‌గా పేర్కొన్నారు.

అపవాదులు, అవమానాల్ని భరిస్తూ..

అయితే, వేళ్ల మీద లెక్కపెట్టే కొంతమంది స్వార్థ, మత రాజకీయ నాయకుల వల్ల, ఈ రెండు వర్గాల మధ్య కొంత భేదాభిప్రాయాలు వస్తున్నాయి. మత రాజకీయాలు చేసే ప్రతి పార్టీ దీనికి కారణం. ఒక చేతితో చప్పట్లు మోగవు కదా.. గత కొన్ని సంవత్సరాల నుండి ముస్లిముల అస్తిత్వాన్ని దెబ్బకొట్టే విధంగా ప్రణాళికలు జరుగుతున్నాయి. ముస్లిముల సాధికారత, ముస్లిముల హక్కులు, ముస్లిం పౌరుల భద్రత, మసీదులు, దర్గాలు, పౌరసత్వం ఇలా ఎన్నో విషయాలపై గొడవలు సృష్టిస్తున్నారు. మతపరమైన ఎన్నో అంశాలలో అపవాదుల్ని, అవమానాన్ని ముస్లిములు భరించాల్సి వస్తుంది.

ముస్లింలు రెండో స్థాయి పౌరులా?

ముస్లింలపై విద్వేష ప్రసంగాలు పెరిగాయి. ముస్లిములు ఆరాధించే అల్లాహ్, పవిత్ర గ్రంథం ఖురాన్, ముస్లిములు అమితంగా ప్రేమించే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు ఎక్కువయ్యాయి. గో వ్యాపారులను అనుమానిస్తూ వారిపై కొన్ని అల్లరి మూకలు దాడులు



చేస్తున్నాయి. ముస్లింలకు చెందిన వ్యాపారాలను, దుకాణాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయి. ముస్లింలను రెండవ పౌరులుగా మార్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అలాగే చట్టసభల్లో ముస్లిముల ప్రాతి నిధ్యం లేకుండా చేయడం తద్వారా వారి గురించి మా ట్లాడే నాయకులు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మత పాఠాలే బోధించడం కాకుండా

పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ముస్లిముల జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలను విడదీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందిన తీరును ఒకసారి గమనిస్తే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని స్పష్టంగా కనిపిస్తుంది. ఇలాంటి సందర్భాలు ఏర్పడడంలో ముస్లిం ప్రజల అలసత్వం, అవగాహన రాహిత్యం కూడా ఉంది. బీజేపీ పార్టీనీ ఓడించాలనే ఆలోచనలో, ఒకసారి ఈ పార్టీ ఒకసారి ఆ పార్టీ, ఈ నాయకుడు కాకుంటే ఆ నాయకుడని సమర్థిస్తున్నారు తప్ప ప్రత్యామ్నాయ ప్రయత్నాలు మాత్రం చెయ్యడం లేదు. ముస్లిం ప్రజల్లో ఇకనైనా రాజకీయ చైతన్యం రావాలి. ముస్లిం మత గురువులు కేవలం మతానికి సంబంధించిన పాఠాలే కాకుండా దునియా దారి గురించి కూడా ఆలోచించి ముస్లిం ప్రజల్లో చైతన్యం పెంచి రాజకీయ నాయకులని తయారు చేయాలి.

గంగా జమున తహజీబ్ గెలవాలి

స్వార్థ రాజకీయాల కోసం ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్న వారికి నా భారతదేశ ప్రజలు ఏదో ఒక రోజు గుణపాఠం చెబుతారు. పోరాట పటిమ గల్గిన నా భారతదేశ ప్రజలు ఇలాంటి వాటిని తిప్పి కొడతారనే నమ్మకం నాకు ఉంది. చివరగా, మనమందరం గెలవాలి, సోదరభావం గెలవాలి, ప్రేమ ఆప్యాయత గెలవాలి, న్యాయం గెలవాలి, గంగా జమున తహజీబ్ గెలవాలని ఆకాంక్షిస్తున్నాను.

# వక్ఫ్ చట్టంలో తప్పులుంటే చెప్పండి

న్యూఢిల్లీ,వక్ఫ్ (సవర) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన 72 పిటిషన్లపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వక్ఫ్‌పై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా.. న్యాయస్థానం అందుకు అంగీకరించింది. కాగా.. సవరణలోని వివిధ అంశాలకు సంబంధించి పిటిషన్లలో అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అంశపై తాజాగా వక్ఫ్ చట్టంపై ప్రశ్నలు లేవనెత్తే వారి కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ జాయింట్ కమిటీ ఛైర్మన్ జగదాంబికా పాల్ స్పందించారు. ఈ చట్టంలో ఒక్క తప్పు తేలితే, తాను తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని ఆయన స్పష్టం చేశారు. జాతీయ మీడియా సంస్థతో జగదాంబికా పాల్ తన భావాలను పంచుకున్నారు. రాజకీయ పార్టీలు ఓటు-బ్యాంకు రాజకీయాల కోసం ఇలా చేస్తున్నాయి. ముస్లింలను సంతృప్తిపరిచే రాజకీయాలు సరికాదు. నేను ఎలాంటి రాజకీయాలతో ప్రేరణ పొందలేదు. పూర్తి నిష్పాక్షికతతో పనిచేస్తున్నాను. వక్ఫ్ సవరణ బిల్లుకు ముందు బీజేపీ 38 సమావేశాలు నిర్వహించింది, అన్ని ప్రశ్నలు నిరాధారమైనవి. కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లలో కొత్త బిల్లు ప్రకారం.. వక్ఫ్ బోర్డులో హిందువులను ఎలా చేరుస్తారనే ప్రశ్న బలంగా వినిపిస్తోంది. దీనికి సంబంధించిన ప్రశ్నలను సుప్రీంకోర్టు కూడా లేవనెత్తింది. ముస్లింలను హిందూ సంస్థలలోకి అనుమతిస్తారా? అని ప్రశ్నించింది. ఈ అంశంపై స్పందించిన జగదంబికా పాల్.. సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకారం వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరుల ఉనికిని ఇప్పటికే నిర్ణయించామని చెప్పారు. వక్ఫ్ బోర్డు ఒక చట్టపరమైన సంస్థ.. మతపరమైన సంస్థ కాదని జగదంబికా పాల్ స్పష్టం చేశారు.

# ముందే వస్తానని... డుమ్మా కొట్టిన విజయసాయి

విజయవాడ, వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణకు మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి గైర్హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల ఈరోజు విచారణకు రాలేకపోతున్నట్లు- సిట్‌కు సమాచారం పంపారు. ఎప్పుడు వస్తానో మళ్లీ సమాచారం ఇస్తానని సిట్ అధికారులకు కబురు పంపించారు. ఈ కేసుకు సంబంధించి 18న విచారణకు రావాల్సిందిగా విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు ఉన్నాయని అందుకే ఒకరోజు ముందుగానే అంటే గురువారమే విచారణకు వస్తానని సిట్ అధికారులకు సాయిరెడ్డి సమాచారం ఇచ్చారు. అందుకు సిట్ అధికారులు కూడా తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అయితే ఇప్పుడు రాలేనని, మళ్లీ మరోసారి వస్తానని విజయసారెడ్డి చెప్పడం పోలీసులను అవాక్కయ్యేలా చేసింది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకున్నారని నిర్ధారణ అయ్యింది. దీనిపై విచారణ జరిపిన సిట్.. పలు ఆధారాలను కూడా సేకరించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం మొత్తానికి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి సూత్రధారి అని, ఆయన కనుసన్నల్లోనే మద్యం కుంభకోణం నడిచిందని నిర్ధారించారు. అయితే ఇప్పటికే మూడు సార్లు విచారణకు రావాల్సిందిగా కసిరెడ్డికి సిట్ నోటీ-సులు జారీ చేసింది. అయితే మూడు సార్లు కూడా విచారణకు డుమ్మా కొట్టారు. అంతేకాకుండా కసిరెడ్డి ఫోన్లు కూడా స్విచ్‌ఆఫ్ చేసిన పరిస్థితి. ఆయన కుటు-ంబసభ్యులను కలిసి నోటీసులు ఇచ్చారు. అలాగే కసిరెడ్డి తండ్రికి నోటీ-సులు జారీ చేశారు. మరోవైపు ఈ కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి శుక్రవారం విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. అయితే మిథున్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో న్యాయవాదిని అనుమతించాలని, వీడియో రికార్డింగ్ చేసేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. మిథున్ రెడ్డి వేసిన పిటిషన్‌పై ఈరోజు విచారణకు వచ్చే అవకాశం ఉంది. కాగా.. మిథున్ రెడ్డితో కలిసి విజయసాయిరెడ్డిని విచారించాలని భావించిన సిట్.. విచారణకు రావాల్సిందిగా సాయిరెడ్డికి నోటీ-సులు ఇచ్చారు. గతంలో కాకినాడ పోర్ట్ వ్యవహారానికి సంబంధించి సీఐడీ విచారణకు హాజరైన సమయంలో మొత్తం మద్యం కుంభకోణంపై మీడియా అడిగిన ప్రశ్నకు సాయిరెడ్డి సంచలనంగా వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం అంతా కసిరెడ్డి కనుసన్నల్లోనే నడిచిందని, దానికి సంబంధించి ఎలాంటి సమాచారం కావాలన్నా అధికారులకు తాను అందిస్తానని గతంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో సాయిరెడ్డికి నోటీ-సులు ఇచ్చిన సిట్ అధికారులు.. విచారణకు వచ్చి తన వద్ద ఉన్న వివరాలు ఇవ్వాల్సిందిగా కోరారు. కొన్ని కారణాల వల్ల ముందు రోజే వస్తారని సమాచారం పంపారు మాజీ ఎంపీ. దీంతో ఈరోజు ఉదయమే విజయవాడ సీపీ కార్యాలయంలో ఉన్న సిట్ కార్యాలయంలో సిట్ బృందం చేరుకుంది. సీపీ కార్యాలయం బయట కూడా భారీ భద్రతను ఏర్పాటు- చేశారు. అయితే మధ్యాహ్నం 12 అయినప్పటికీ సాయిరెడ్డి విచారణకు రాలేదు. కొన్ని కారణాల వల్ల విచారణకు హాజరుకాలేకపోతున్నానని, మళ్లీ ఎప్పుడు వచ్చేది సమాచారం అందిస్తానని సిట్ అధికారులకు కబురు పంపారు. విజయసాయిరెడ్డి వ్యవహారంతో సిట్ అధికారులు అవా-క్కై-÷-కన పరిస్థితి. ముందు రోజే వస్తానని స్వయంగా సమాచారం ఇచ్చి.. మధ్యాహ్నం వరకు కూడా ఎదురు చూసేలా చేసి మరి ఇప్పుడు మళ్లీ రాలేకపోతున్నట్లు- సమాచారం పంపడంపై పోలీసులు ఆరా తీస్తున్న పరిస్థితి.

# మరో సామాజిక ఉద్యమం

మంచిర్యాల, తెలంగాణలో మరో సామాజిక ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందిన షెడ్యూల్డ్ తెగలు(ఎస్టీలు) కూడా వర్గీకరణకు గళమెత్తుతోంది. ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, ఆదివాసీ స్టూడెంట్ యూనియన్, పలు ఆదివాసీ ప్రజాసంఘాలు ఉద్యమానికి సిద్ధమయ్యాయి. ప్రభుత్వం 15 శాతం ఎస్సీ కోటా రిజర్వేషన్‌లో మాదిగ ఉపకులాలకు 9 శాతం, మాల ఉపకులాలకు 5 శాతం, సంచార జాతులకు ఒక శాతం వర్తింపజేయాలని నిర్ణయించింది. అలాగే ఎస్టీలకు అమలవుతున్న 10 శాతం రిజర్వేషన్లను కూడా ఉపకులాల వారిగా, జనాభా ప్రాతిపదికన పంచాలని ఆదివాసీల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసుకోవచ్చని 2024 ఆగస్టులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. దీంతో ప్రభుత్వానికి వర్గీకరణ చేయాల్సిన అనివార్యత ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అసెంబ్లీలో బిల్లు ఆమోదించింది. ఇప్పుడు ఎస్టీలను వర్గీకరించేందుకు కూడా వెంటనే కమీషన్‌ను నియమించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

1996 నుంచి ఉద్యమం.. లంబాడీ, ఆదివాసీ వివాదం

ఎస్టీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలనే డిమాండ్‌తో 1996లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ సంఘాలు ఉద్యమం చేపట్టారు. 2017లో వర్గీకరణ ఉద్యమాన్ని కొందరు నేతలు రాజకీయ స్వప్రయోజనాల కోసం పక్కదారి పట్టించారని విమర్శలు చేశారు. ఎస్టీల జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే డిమాండ్‌తో కొందరు ఉద్యమాన్ని చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ తరహా ఉద్యమాలు ఎక్కువగా జరిగాయి. ఉద్యమాన్ని పక్కదారి పట్టించిన నేతలు రాజకీయలబ్ధి పొందారని, తమకు న్యాయం జరగలేదని ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ప్రజాసంఘాల సమావేశాలు, మేధావుల అంతర్మథనంతో ఉద్యమరూపంపై స్పష్టత వచ్చిందని ఆదివాసీ నేతలు చెబుతున్నారు. లంబాడీలను ఎస్టీల జాబితా నుంచి తొలగించాలని కాకుండా ఎస్టీల రిజర్వేషన్ల వర్గీకరణ నినాదంతో ఉద్యమించనున్నట్టు స్పష్టం చేస్తున్నారు.

వర్గీకరణ ఎలా ఉండాలి? ఆదివాసీల డిమాండ్ ఏంటి?

ఎస్టీలను నాలుగు రకాలుగా వర్గీకరించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలోని ఎస్టీ జాబితాలో 33 తెగలు ఉన్నాయి. ఇందులో యానాది, ఎరుకల, లంబాడీ అనే మూడు వర్గాలను 1976లో జాబితాలో చేర్చారు. అప్పటివరకు ఎస్టీలకు 4 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 6 శాతం పెంచారు. కానీ 1976లో ఎస్టీల్లో చేర్చిన వారి ప్రాంతంతో పాటు మైదాన ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. వారు ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్నవారు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎక్కువ లబ్ధిపొందేందుకు ఆదివాసీలు చెబుతున్నారు. ప్రాంతాలలో జీవించే ఆదివాసీలకు సముచితన్యాయం చేకూర్చేందుకు ఎస్టీలను వర్గీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. 1976లో ఎస్టీల్లో చేర్చిన వర్గాలను ఒకటిగా వర్గీకరించి, మిగిలిన ఆదివాసీ తెగలను మూడు రకాలుగా వర్గీకరించాలని కోరారు. పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్(పీవీటీజీ) పరిధిలోని కొలాం, తోటి, మన్నేవార్‌లోని ఇతర తెగలను ప్రత్యేక గ్రూపుగా, మిగిలిన ఆదివాసీలను ఒక గ్రూపుగా, ఆదివాసీల్లోని సంచార తెగలను మరో వర్గంగా మొత్తం నాలుగు రకాలుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కమీషన్‌ను నియమిస్తే ఈ ప్రతిపాదనలను అందజేస్తామని ఆదివాసీ నేతలు అంటున్నారు.

# కడియం లక్ష్యంగా బిఆర్ఎస్ విమర్శలు



జనగామ,ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయం వేడెక్కింది. నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కడియం కాంగ్రెస్‌లో చేరడంతో బిఆర్ఎస్ నేతలు విమ్మలకు పదను పెడుతున్నారు. ప్రధానింగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యలు అదేపనిగా విమర్శలు చేయడం, దానికి ధీటుగా కడియం శ్రీరి ఎదురదాడికి దిగడంతో రాజకీయం రక్తి కడుతోంది. ఇంతకాలం వరకూ భాయ్ భాయ్ అంటూ తిరిగిన నేతలు.. ఒక్కసారిగా మెడలో కండువా మారడంతో బద్ధ శత్రువులైపోయారు. మొన్నటి వరకూ కలుపుగోలుగా తిరిగిన నేతలు మాటల దాడి చేసుకుంటున్నారు. వరంగల్ ఎంపీ సీటు విషయంలో పార్టీ మారిన కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో కడియం శ్రీహరికి డాక్టర్ రాజయ్య సవాల్ విసిరారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. త్వరలో కడియం విదేశీ ఆస్తుల వివరాలు బయటపెడతానన్నారు. కడియంపై మాజీ మంత్రి దయాకర్ రావు సెటైర్లు వేశారు. కడియం జీవిత చరిత్ర మొత్తం తన చేతిలో ఉందన్నారు. టైం వచ్చిన రోజు బయటపెడతాన్నారు. కడియం శ్రీహరి వల్ల కాంగ్రెస్‌కి త్వరలో పెనుప్రమాదం పొంచి ఉందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 2, 3 నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తాయంటున్నారు. సుప్రీం తీర్పుతో కడియంకు కూడా నోటీసులు వస్తాయన్నారు. ఆయన మాజీ కాక తప్పదని అంటున్నారు. అయితే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్యపై మండిపడ్డారు కడియంశ్రీహరి. లిఫ్ట్ ఇరిగేషన్‌లో పల్లా లంచాలు తీసుకుంటే.. దళితబంధులో రాజయ్య లంచాలు తీసుకున్నారని ఆరోపించారు కడియం. వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ వర్సెస్ కడియం అన్నట్లుగా మారింది రాజీయం. కడియం టార్గెట్‌గా బీఆర్ఎస్ నేతలు ప్రచారం మొదలెట్టారు. ఈవిమర్శల దాడి ముందుముందు ఇంకెత వరకూ వెళ్తోందో చూడాలి.

# ముసుగు తీసేస్తున్న నయా కోవర్ట్.. విజయసాయి

అమరావతి,వైఎస్ కుటుంబంతో తనకు మూడు తరాలుగా విడదీయరాని అనుబంధం ఉన్నదని ఆయన చాలా ఘనంగా చెప్పుకుంటారు. జగన్ మాత్రమే కాదు.. రాజారెడ్డి, రాజశేఖర రెడ్డి కూడా తనకు ఎంతో ఆత్మీయులని చాటుకుంటారు. ఆయన నిన్నటిదాకా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో ఒక్క వెలుగు వెలిగారు. ఎంతగా అంటే.. ఆయన చెబితే.. జగన్మోహన్ రెడ్డి చెప్పినట్టే.. అని పార్టీలోని ఎంతటి సీనియర్ నాయకులు కూడా శిరసావహించే స్థాయిని అనుభవించారు.పార్టీలో కింగ్ పిన్ గా చక్రం తిప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే.. జగన్ తర్వాత తానే అన్నంతగా హవా చెలాయించారు. ఎందుకోగానీ.. ఆయనకు ఒక్కసారిగా పార్టీ చేదుగా అనిపించింది. జగన్మోహన్ రెడ్డితో మైత్రి కూడా విషంలా అనిపించింది.సాధారణంగా నాయకులు తమను పార్టీలు లూప్ లైన్లో పెట్టేసిన తర్వాత రాజీనామా చేస్తుంటారు. కానీ, ఆయన మాత్రం నెత్తిన పెట్టుకున్న పార్టీకి రాజీనామా చేసి, రాజ్యసభ ఎంపీ పదవిని కూడా వదులుకున్నారు. సేద్యం చేసుకుంటాను.. రాజకీయాల జోలికి రాను అని ప్రకటించారు. కానీ.. వాస్తవాన్ని జాగ్రత్తగా గమనిస్తే.. ఆయన ఇప్పుడిప్పుడే 'సేద్యం చేసుకునే మాజీ నాయకుడు' అనే ముసుగును తొలగించి.. ఎన్డీయే కూటమి పార్టీల కోవర్టు అవతారాన్ని బయటపెట్టుకుంటున్నారు అని అనిపిస్తోంది. ఆయనే విజయసాయిరెడ్డి!లిక్కర్ వ్యాపారం విషయంలో జగన్ సర్కారు ఏర్పడిన తర్వాత కొత్త పాలసీ తీసుకువచ్చింది. ఎలాంటి అవకతవకలు జరగకూడదనే ఉద్దేశంతోనే దుకాణాలన్నింటినీ ప్రభుత్వ పరంగానే నిర్వహించారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్ జగన్ లిక్కర్ పాలసీ ద్వారా పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలతో కేసులు నమోదుచేశారు. ఎన్నికల ప్రచార సమయంలో లిక్కర్ వ్యాపారంలో 30వేల నుంచి 50 వేల కోట్ల వరకు జగన్ కాజేశారని ఆరోపణలు చేసిన వారు కాస్తా.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. మూడువేల కోట్ల అవినీతి జరిగినట్టు లెక్కలు తయారుచేశారు.కసిరెడ్డి రాజశేఖర రెడ్డిని నిందితుడిగా చూపించి.. విచారణకు ప్రయత్నిస్తున్నారు. ఆయన అందుబాటులోకి రాకుండా పరారీలో ఉన్నారు. ఆయన ద్వారా వైసీపీలోని ప్రముఖుల పేర్లను కూడా చెప్పించి.. వారందరినీ కేసులో ఇరికించాలనే వ్యూహంతో అడుగులు వేస్తున్నారు. ఈ సమయంలో కసిరెడ్డి దొరక్కపోగా.. మరోవైపు ఆ కేసుతో సంబంధం లేని, కేసులో కనిపించని.. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిని సాక్షిగా వచ్చి వివరాలు చెప్పాలంటూ నోటీసులు పంపారు. సో, సాక్షిగా ఇప్పుడు విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరుకాబోతున్నారు.విజయసాయి రెడ్డి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ మద్యం కుంభకోణం గురించి అనేక సంగతులు అన్నారు. తాను పార్టీకి రాజీనామా చేసిన సమయంలో.. ఇకమీదట రాజకీయాల్లో ఉండను, మాట్లాడను అని సెలవిచ్చిన విజయసాయి.. ఆ సందర్భంలో మద్యంకుంభకోణం గురించి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరు మీద ప్రజలకు అనుమానాలు కలిగేలాగా మాట్లాడడం విశేషం.లిక్కర్ స్కామ్ కు కర్త కర్మ క్రియ అన్నీ కసిరెడ్డి రాజశేఖర రెడ్డేనని.. సందర్భం వచ్చినప్పుడు తనకు తెలిసిన అన్ని వివరాలూ



బయటపెడతానని అన్నారు. ఇలాంటి మాటల ద్వారా.. ఆయనే తనను సాక్షిగా విచారణకు పిలిపించుకునేలా వాతావరణం క్రియేట్ చేశారనే అభిప్రాయం పలువురిలో ఉంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఇప్పుడు విచారణలో విజయసాయి ఏం చెప్తారనేది ఆసక్తికరం.'తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టినట్టుగా' అని ఒక సామెత ఉంటుంది. ఇప్పుడు విజయసాయి తీరు కూడా అలాగే ఉంది. ప్రస్తుతం జగన్ తో విభేదించి ఉన్న ఆయన ఏ విచారణకు పిలిచినా.. జగన్ కు వ్యతిరేకంగా తాను ఎంత చెప్పగలడో అంతా చెప్పగలరని ఊహించవచ్చు. ఇన్నాళ్లూ తనకు అత్యున్నత పదవులు కట్టబెట్టి గౌరవంగా చూసుకున్న పార్టీని వీడిపోయి.. ఇతరులతో కుమ్మక్కు అయి అదే పార్టీని సర్వనాశనం చేయడానికి కంకణం కట్టుకున్నట్టుగా ఆయన ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.విజయసాయి వైసీపీలో కోటరీ మాట నడుస్తున్నదనే ఆరోపణలు రువ్వి బయటకు వెళ్లిపోయారు. గతంలో వెళ్లిపోయిన అనేక మంది ఆయన మీద కూడా అవే ఆరోపణలు చేశారు. ఎప్పుడు ఎవరికి మాట సాగకపోతే.. ఇలాంటి బురద చల్లేసి పారిపోవడమే పరిష్కారమా అనేది ప్రజల సందేహం.ఒక సంస్థను, వ్యవస్థను ప్రేమించే వ్యక్తి అయితే.. ఆ వ్యవస్థలో లోపాలను దిద్దేందుకు పోరాడాలి. ఆ సంస్థ తనది అనుకున్నప్పుడు అలాగే ప్రవర్తిస్తారు. పైగా సంస్థలో ఉన్నప్పుడే పోరాడి దానిని చక్కబెట్టాలి. అలా చేయకుండా.. సంస్థలో అత్యున్నత పదవులు అనుభవిస్తూ.. రహస్యాలు, మార్మికమైన సంగతులు అన్నీ తెలుసుకుని.. బయటకు వెళ్లిపోయిన తర్వాత.. వాటన్నింటినీ ప్రత్యర్థుల చేతికి అందిస్తూ.. సంస్థ పతనానికి కారణంగా మారితే.. దానిని ఎలా అర్థం చేసుకోవాలి అని ప్రజలు విస్తుపోతున్నారు.వెన్నుపోటు అంటే చంద్రబాబునాయుడు అని కొందరు అంటూ ఉంటారు. కానీ.. అంతకంటె విజయసాయి వైసీపీ నేతలను ఇరుకున పెట్టేలా మాట్లాడడం, వ్యవహరించడం అనేది వెన్నుపోటు అనే పదం కంటె పెద్ద వ్యవహారం అన్నట్టుగా ప్రజలు భావిస్తున్నారు. విజయసాయి తనను తాను కాపాడుకోవడానికి, పార్టీ నుంచి బయటకు వచ్చేసి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, జగన్మోహన్ రెడ్డిని కూడా బలిపశువుగా మార్చేయడానికి తెగిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

# బిజెపిని ఓడించడమే మా ప్రథమ లక్ష్యం



హైదరాబాద్, బీజేపీని ఓడగొట్టడమే మా లక్ష్యం అని కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చెప్పారు. నేషనల్ హెరాల్డ్ కేసు చార్జ్‌షీట్‌లో రాహుల్ గాంధీ, సోనియాగాంధీల పేర్లు చేర్చడంపై కాంగ్రెస్ శ్రేణులు అగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ నేతలు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వెంకట్, మాజీ ఎంపీ విహెచ్‌తో పాటు– తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీ తప్పుడు వ్యవహారాలపై పోరాటం చేస్తుందని ప్రకటించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోడీకి తగిన సందేశాన్ని పంపినట్లు ఆమె తెలిపారు. మోడీ సర్కార్ కక్షపూరిత రాజకీయాలు చేస్తూ, రాహుల్ గాంధీకి నోటీసులు ఇచ్చింది. ఇప్పుడు దేశంలో ఆందోళన పరిస్థితి నెలకొంది. భవిష్యత్తు తరానికి మంచి జరుగుతుందో లేదో అనే భయం ప్రజల మదిలో పెరిగిందన్నారు. కుంభమేళా సందర్భంలో కూడా కుల వివక్ష చూపించారని మండిపడ్డారు. హిందూ రాష్ట్రంలో పేద గుడిసెలో నివసించే ప్రజలను చెత్త వేసేదగ్గర, డంపింగ్ యార్డ్ వద్ద ఉంచుతారు. ఈ సమయములో వారు హిందువులా కాకుండా మానవత్వాన్ని కోల్పోతారని ఆమె అన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడినప్పుడు, కేంద్రం వారిని ఈడీ కేసులతో వేధించడంతో పాటు విచారణలు పెట్టి హరితమైన పరిస్థితులను తయారు చేస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కులగణన , ఎస్సీ వర్గీకరణలాగా రాహుల్ గాంధీ దేశమంతటా ఇదే విధానం కోరుకుంటు–న్నారని ఆమె తెలిపారు. ఈ దేశంలో సమానత్వాన్ని, సామాజిక న్యాయం అందించాలంటే కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆమె అన్నారు. నేషనల్ హెరాల్డ్, ఒక నాన్ ప్రాఫిట్ సంస్థగా, అవినీతి లావాదేవీలు జరపలేదని చెప్పడం వాస్తవమేనని, కానీ ఈడీ మాత్రం మనీలాండరింగ్ కేసులు ఎక్కించేసిందని ఆమె మండిపడ్డారు. ఇటు–వంటి పరిస్థితులు గతంలో కూడా ఉండే, అప్పట్లో ఇందిరా గాంధీ పోరాటం చేశారు. ఇప్పుడు మన వంతు అని ఆమె వ్యాఖ్యానించారు. ట్రంప్ నిర్ణయాలపై మోడీ ఎందుకు మౌనంగా ఉంటు–న్నారు? ఆయన ట్రంప్ స్నేహితుడే కదా. అయితే, ట్రంప్ నిర్ణయాలతో దేశానికి నష్టం జరుగుతుంటే మోడీ ఎందుకు మాట్లాడకుండానే ఉంటారు? అని ఆమె ప్రశ్నించారు. ధనికుడు అయినా, పేదుడు అయినా, వారి ఓటు– విలువ ఒక్కటే అని, సామాజిక న్యాయం అందరికీ సమానంగా అందాలంటే, కొత్త నినాదంతో ముందుకు సాగాలన్నారు అదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆమె తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా పోరాటమని ఆమె ఉద్ఘాటించారు.

### జీడిమెట్లలో విషాద ఘటన...

హైదరాబాద్, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజుల రామారం ప్రాంతంలో ఓ హృదయ విదారక ఘటన చోటు–చేసుకుంది. కుటుంబ కలహాలతో మానసికంగా చితికిపోయిన ఓ తల్లి, తన ఇద్దరు చిన్నారులను వేట కొడవలితో నరికి, అనంతరం బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ దారుణ ఘటన మృతిచెందిన తల్లి తేజస్విని రెడ్డిగా, ఆమె కుమారులు హర్షిత్ రెడ్డి (7), ఆశిష్ రెడ్డి (5) గా పోలీసులు వెల్లడించారు.

# అమరావతికి మోడీ.. భారీ ప్యాకేజీపై రాష్ట్ర ప్రజల ఆశలు!

అమరావతి,నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో పునర్నిర్మాణ పనులకు త్వరలోనే అడుగు పడనుంది. మే 2న అమరావతి రానున్న భారత ప్రదాన మంత్రి నరేంద్ర మోదీ రాజధాని పునర్నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రధాని టూర్ షెడ్యూల్ ఖరారు అయ్యింది. మోడీ పర్యటనకు, పునర్నిర్మాణ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు శరవేగంగా జరుగు తున్నాయి. మే2వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు మోడీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పీఎం పర్యటనపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. పర్యటన ఏర్పాట్లపై అధికారలతో సమీక్ష నిర్వహించారు.మోడీ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నభూతో అన్నట్లుగా నిర్వహిం చాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మోడీ సభకు దాదాపు 5లక్షల మంది ప్రజల పాల్గొంటారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనక 250 ఎకరాల విస్తీర్ణంలో మోడీ సభ జరగనుంది. అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం పడినా ఎటువంటి ఇబ్బందీ లేకుండా సభా స్థలంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇదంతా ఓకే కానీ గతంలో అమరావతి నిర్మాణానికి భూమి పూజ చేయడానికి వచ్చిన సందర్భంగా మోడీ పవిత్ర జలాలు, పుణ్య క్షేత్రాల నుంచి మట్టి తీసుకువచ్చారు. ఈ సారి అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి రానున్న మోడీ ఏం తీసుకువస్తారన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తం అవుతున్నది. ప్రధాని హోదాలో అమరావతి నిర్మాణానికి నరేంద్రమోడీ 2017లో శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విభజనతో అన్ని విధాలుగా నష్టపోయిన ఏపీకి మోడీ ఆ సందర్భంగా భారీ వరాలను ప్రకటిస్తారని అంతా భావించారు. అయితే పుణ్య స్థలాల నుంచి మట్టి, పుణ్య నదుల నుంచి జలం తీసుకువచ్చిన మోడీ ఏపీకి కానీ, ప్రపంచ స్థాయి రాజధాని కావాలని ఆయన నోటితోనే చెప్పిన అమరావతికి కానీ ఎటువంటి ప్యాకేజీ ప్రకటించలేదు. దీనిపై అప్పట్లోనే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ సారి మోడీ అమరావతికి ఏం చేస్తారు? ఏం ఇస్తారు? అన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. అప్పట్లో అంటే 2017లో తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీ మాత్రమే. అయితే తెలుగుదేశం మద్దతు లేకంటే కేంద్ర సర్కార్ కు అప్పట్లో ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేదు. అయితే



ఇప్పుడు పరిస్థితి అది కాదు. 2024 ఎన్నికల తరువాత కేంద్రంలో మోడీ సర్కార్ కు తెలుగుదేశం మద్దతు అత్యవసరంగా మారింది. తెలుగుదేవం మద్దతుతోనే మోడీ సర్కార్ మనుగడ సాగుతుందన్న పరిస్థితి ఉంది.దీంతో కేంద్ర ప్రభుత్వం ఏపీకీ,అలాగే తెలుగుదేశం పార్టీకీ గతంలో ఎన్నడూ లేనంతగా ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే చంద్రబాబు కూడా కేంద్ర కేబినెట్ బెర్తులు వంటి విషయాలలో పట్టుబట్టకుండా, ఏపీకి ఇతోధిక ఆర్థిక తోడ్పాటుపైనే పట్టుబడుతున్నారు.ఆ కారణంగానే అమరావతికి కేంద్రం నుంచి అనూహ్య మద్దతు లభించింది.వరల్డ్ బ్యాంకు రుణంతో పాటుగా హడ్కో రుణాలకు కేంద్రం గ్యారెంటీ ఇచ్చి మరీ అమరావతికి అండగా నిలిచింది. అంతే కాకుండా అడగకుండానే అమరావతికి రైల్వే లైను, అవుటర్ రింగు రోడ్డు, ప్రధాన జాతీయ రహదారులను కలిపేలా కొత్త రహదారులు, ఇలా వరాలు ఇచ్చేసింది,ఇటువంటి పరిస్థితుల్లో అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న మోదీ కచ్చితంగా రాజధాని అమరావతికి ఓ భారీ ప్యాకేజీ ప్రకటిస్తారన్న భావన సర్వత్రా వ్యక్తం అవుతోంది.సామాన్య జనం నుంచీ రాజకీయ పరిశీలకులు కూడా అమరావతి పనులకు నిధుల కొరత మాట లేకుండా మోడీ భారీ వరాలను ఇచ్చే అవకాశం ఉందనే అంచనా వేస్తున్నారు.

# వృత్తి రాజకీయం- ప్రవృత్తి అరాచకం!



కడప: వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అరాచకాలు పెరిగిపోయాయని ప్రభుత్వ అనుకూల పత్రిక రాసిన కథనం సంచలనం రేపుతోంది. ఆ కథనం చదివిన పాఠకులకు.. ఆది వృత్తి రాజకీయం, ప్రవృత్తి అరాచకం అనే అభిప్రాయాన్ని కలిగిస్తోందన్న చర్చకు తెరలేచింది. కాంట్రాక్ట్ పనులన్నీ తమ వాళ్లకు ఇవ్వని కారణంగా, ఏకంగా సిమెంట్ పరిశ్రమలో ఉత్పత్తి నిలిచిపోయేలా చేశారని ఆ కథనం తేల్చి చెప్పింది.జమ్మలమడుగు నియోజకవర్గంలో మూడు సిమెంట్ పరిశ్రమలు, ఒక థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఉన్నాయి. అధికారంలో ఉన్న బీజేపీ, టీడీపీ నాయకులు, ఆ పరిశ్రమలను ఆదాయ వనరుగా మార్చుకోవాలని భావించాయి. అధికారంలో ఎవరున్నా చేసే పని ఇదే. అయితే కూటమి అధికారంలో డిమాండ్ స్థాయిని మించి, అరాచకానికి తెరలేపడం ఆందోళన కలిగిస్తోంది.గతంలో వైసీపీ హయాంలో ప్రజాప్రతినిధుల బెదిరింపులతో పరిశ్రమలు తరలివెళుతున్నాయనే విమర్శల్ని టీడీపీ, జనసేన నేతలు గుప్పించారు. ఇప్పుడు వాళ్ల పాలనలో వైసీపీ పాలకులే మేలు అనే నీతిలో వాళ్ల దౌర్జన్యాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఎప్పటికీ చంద్రబాబే అధికారంలో ఉండాలని కోరుకునే పత్రిక.. ఇవాళ కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అరాచకాలు మితిమీరాయని రాయడం, పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి.ఎర్రగుంట్ల, చిలమకూరులలోని ఆల్ట్రా సిమెంట్ పరిశ్రమ లకు ప్లైయాష్, సున్నపురాయి సరఫరా జరగకుండా ఆదినారాయణరెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. ఆర్టీపీపీ నుంచి ప్లైయాష్ సరఫరా కాకుండా అడ్డుకు న్నారు. సిమెంట్ తయారీకి అవసరమైన ముడిసరుకు సరఫరాను అడ్డుకోవడంతో చిలమకూరులో సిమెంట్ పరిశ్రమ ఉత్పత్తి ఆగిపోయింది. ఇవాళ్టి నుంచి మరో యూనిట్‌లో ఉత్పత్తి ఆగిపోనున్నట్టు సదరు పత్రిక రాయడం గమనార్హం.ఈ వ్యవహారంపై సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా కడప ఎస్పీకి కలెక్టర్ ఫోన్ చేసి అరాచకాల్ని అడ్డుకోవాలని కోరడం చర్చనీయాంశమైంది. గతంలో కూడా ఆదినారాయణరెడ్డి అనుచరుల అరాచకాలు వెలుగు చూశాయి. అయినప్పటికీ అడ్డుకోలేకపోయారు. అందుకే అరాచకాలు కొనసాగుతున్నాయనే అభిప్రాయాన్ని కొట్టి పారేయలేని పరిస్థితి.

# గోశాల వివాదం.. ఆత్మరక్షణలో కూటమి!

తిరుపతి:తిరుపతిలోని టీటీడీ గోశాలలో అవులు చనిపోతున్నాయంటూ టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ సీనియర్ నేత భూమన కరుణాకర రెడ్డి లేవనెత్తిన అంశం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదంలో ఎలా స్పందించాలో, ఎలా వ్యవహరించాలో తెలియక, మరోవైపు అప్రతిష్టను మూటకట్టుకుంటూ కూటమి ప్రభుత్వం పూర్తిగా ఆత్మరక్షణలో పడింది.గోశాలలో గోవులు మరణిస్తున్నాయని భూమన చేసిన విమర్శలను టీటీడీ మొదట్లో చాలా తేలిగ్గా తీసుకుంది. అలాంటిదేమీ లేదంటూ కొట్టిపారేసింది. ఆ తర్వాత కరుణాకర రెడ్డి గోవులు మృతి చెందిన ఫోటోలు విడుదల చేయడంతో వివాదం మరింత రాజుకుంది. దాంతో టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు స్పందిస్తూ వృద్ధాప్యంతో కొన్ని ఆవులు మృతి చెందినమాట వాస్తవమేనని అంగీకరించారు. ఆ మరుసటిరోజే మీడియా సమావేశం నిర్వహించిన టీటీడీ ఈవో శ్యామలారావు గోశాలలో మూడు నెలల కాలంలో 43 అవులు మరణించినట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రతినెలా సగటున 15 ఆవుల దాకా మరణిస్తూ వుంటాయని కూడా ఈవో వెల్లడించారు. మరోవైపు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 42 గోవులు మాత్రమే మృతి చెందాయని సెలవిచ్చారు. దీంతో భూమన చేసిన విమర్శలను ఈవోతో పాటు చైర్మన్, కూటమి ఎమ్మెల్యే ధ్రువీకరించినట్లు అయింది.టీటీడీ ఈవో ప్రెస్‌మీట్ తర్వాత భూమన విమర్శలకు మరింత బలం చేకూరింది. గోశాలలో 1800 ఆవులుంటే అందులో వృద్ధాప్యం కారణంగా నెలకు 15 ఆవులు మరణించడం ఏమిటన్న చర్చ మొదలయింది. ఈ లెక్కన 10 ఏళ్లలో గోశాలలోని ఆవులన్నీ అంతరించిపోతాయి. వాస్తవంగా పశువుల సహజ మరణాల రేటు 3 శాతం మాత్రమే వుంటుందని శాస్త్రవేత్తల అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే. వెయ్యి పశువులుంటే అందులో వృద్ధాప్యం వల్ల ఏడాదికి 30 మాత్రమే చనిపోతాయి. ఆ లెక్కన గోశాలలో మరణించే పశువుల సంఖ్య ఏడాదికి 60కి మించకూడదు. అయితే మూడు నెలల్లోనే 43 ఆవులు మరణించినట్లు ఈవో ప్రకటించడం సంచలనంగా మారింది.ఈ పరిస్థితుల్లో భూమన చేసిన విమర్శలు నిజమేకదా అనే భావన సర్వత్రా వ్యక్తయింది. భూమన చెప్పిన 100 సంఖ్యలో తేడా వుండొచ్చేమోగానీ ఆవుల మరణాలు నిజమేకదా, టీటీడీ ఏమి చేస్తోందని అంటూ శ్రీవారి భక్తులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే తెలుగుదేశం అనుకూల మీడియా కొత్త, వింత ప్రచారానికి శ్రీకారం చుట్టింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మతాల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్నదంటూ ఒకమాట, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నదం టూ ఇంకోమాటను ప్రచారంలోకి తెచ్చింది.టీటీడీ గోశాలలో జరుగుతున్న అన్యాయాన్ని బయటకుతెస్తే.. సరి చేసుకోకుండా ఇదేమి ఎదురుదాడి అనే అభిప్రాయం సోషల్ మీడియాలో వ్యక్తమయింది. గోవులు మృతి చెందాయని టీటీడీ అంగీక



రిస్తుండగా, దాన్ని బయటకు వెల్లడించడం హిందూ ధర్మాన్ని కించపరచడం ఎలా అవుతుందన్న ప్రశ్న కూటమి ప్రభుత్వానికి ఎదురయింది. మొత్తంగా ప్రభుత్వ అనుకూల మీడియా ఎత్తుకున్న ప్రచార ఎత్తుగడ ఫలించ లేదు.ఈ క్రమంలోనే చంద్రబాబు నాయుడు మొన్న జరిగిన కేబినెట్ సమావేశంలో గోశాల వివాదాన్ని ప్రస్తావించారు. భూమన చేస్తున్న విరమర్శలను సరిగా తెప్పికొట్టలేకపోతున్నామని ఆయన మంత్రులపై అసహనం వ్యక్తం చేసినట్లు వార్తలొచ్చాయి. అధినేత అలా మాట్లాడాక కూడా ఊరుకుంటే ఇబ్బంది అవుతుం దని అనుకున్నారో ఏమోగానీ. తిరుపతిలోని కూటమి నేతలు తీరిగ్గా వారం రోజుల తరువాత హడావుడి మొదలుపెట్టారు. గోశాలపై భూమన చేస్తున్న విమర్శలకు నిరసనగా గురువారం ఉదయాన గోశాల వద్దకు ర్యాలీ చేస్తామంటే బుధవారం రాత్రి నుంచి ఇటు తిరుపతి, అటు చంద్రగిరి నియోజక వర్గం నేతలు వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టడం మొదలుపెట్టారు. అలాగే టీటీడీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ కూడా భూమనకు సవాల్ విసిరారు. ఈ అంశంపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఈ సవాల్‌ను స్వీకరిస్తున్నానని, గురువారం ఉదయం 10 గంటలకు గోశాల వద్దకు చర్చకు వస్తానని కరుణాకర రెడ్డి ప్రకటించారు.దీంతో గురువారం తెల్లవారేకల్లా పరిస్థితి మారిపోయింది. తాము ర్యాలీ చేయడం లేదని, ఎమ్మెల్యేలు గోశాలను సందర్శించి, మీడియాతో మాట్లాడతారని కూటమి నేతలు వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టారు. మరోవైపు బుధవారం రాత్రి నుంచే తిరుపతిలోని వైసీపీ నేతల ఇళ్ల వద్దకు పోలీసులు చేరుకున్నారు. నేతలను గృహ నిర్బంధం చేశారు.భూమన కరుణాకర రెడ్డి ఇంటి వద్ద దాదాపు 100 మంది పోలీసులు మోహరించారు. ఆయన్ను బయటకు రానీకుండా ఇంటిలోనే నిర్బంధించారు.వాస్తవంగా టీటీడీ ఈవో వివరణ ఇచ్చిన తర్వాత ఈ అంశంపైన ఇక మాట్లాడకూడదని,వదలిపెట్టాలని భూమన భావించారు. అయితే పార్టీ అధినేత మెప్పు కోసం కూటమి నేతలు హడావుడిగా ర్యాలీ ప్రకటన చేశారు. అధికారంలో వున్న పార్టీ ర్యాలీ చేయడం ఏమిటి?

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com